# ఆడపిల్లలు

- బమ్మిడి జగదీశ్వరరావు



'అమ్మా...'

'.........'

'మన పెరట్లోని కుక్క గురించే కాదు, చాలా కుక్కలంతే.. నాలుగు పిల్లల్ని పెట్టినా అందులో రెండు పిల్లల్నయినా - తనే జన్మనిచ్చినా సరే - పురిట్లోనే.. ఆకల్తోనే... కడుపులోంచి వచ్చిన వాటిని తిరిగి కడుపు లో వేసుకుంటుంది...'

'........'

''... చాలా జంతువులంతే... మనిషీ జంతువే... అన్నట్టు మొన్ననే రేడియోలో విన్నాం... ఆ పొద్దుటి పూట నువ్వూ వున్నావ్... విన్నావు కదమ్మా... పాము ల్లోనూ అంతేనట.. రక్తపింజర వంద పిల్లల్ని పెడితే... ఒక్క దఫాకే పెద్ద కాన్పే... అందులో కనీసం యాభై పిల్లల్నయినా తినేస్తుందట. అందుకేనట ఆ పిల్లల్ని బతకనివ్వడానికి 'జూ' అధికారులు తల్లికి దూరంగా పిల్లల్ని వుంచి పెంచుతున్నారట...''

'.........'

'మనుషులూ అంతేనమ్మా... పిల్లల్ని తింటు న్నట్టు తెలీకుండా తింటుంటారు. పెరిగి పెద్దయితే ఇదిగో మాలా... సారీ.. నాలా మింగుడు పడకుండా తయారైతే తట్టుకోలేరు. నాన్నదీ నీది ఇప్పుడు అదే పరిస్థితి...' -

'నా కింకేమీ వినిపించలేదు, వినిపించినా బుర్ర పని చెయ్యలేదు. కాళ్ళూ చేతులూ ఆడలేదు. నోటం ట మాట కూడా రాలేదు.

ఎంతమాట? అంతకన్నా తుపాకీ తూటా గుండె ల్లో దిగిపోయినా తట్టుకోవచ్చు. అమ్మకి అర్థం గుండె మీద పచ్చబొట్లు పొడిసినట్టు పొడిచి మరీ చెప్పింది. సూదుల్తో కాదు, దబ్బలాల్తో కాదు, గునపాల్తోనే గుచ్చి పోయింది.

ఎంత రవ్వ కండ.. ఎంత చిన్న మాంసం ముద్ద... ఈ కండని కొండ చేస్తే ఆ కొండ రెక్కలొచ్చి ఇలాగ గుండెలమీద వాల్తాదనుకోలేదు.. వాలడం కాదు తేరుకోలేనట్టు తన్నేసి మరీ ఎగిరిపోయింది.

నవత!

నా పెద్ద కూతురు. తొలిచూలు మలిచూలు మగ బిడ్డల తర్వాత ముచ్చటగా మూడోబిడ్డ.. మహలక్ష్మి.. ఆడపిల్ల పుట్టిందనుకున్నాం...

నిజమే, మహలక్ష్మికి 'నవత' పేరు విచిత్రమే. అందరూ అప్పుడు ఊర్లో అదేమాట అన్నారు, కాని ఆ మేష్టుగోరు 'నవత'ని పెట్టమన్నాడు, పిలిచాడు, పిలిపించాడు. ఈ పిల్లా ఆ పేరుకే పలికితే పిలవక తప్పింది కాదు.. కొత్తగా వుంది కానిమ్మన్నారు. ఇప్ప టికీ ఎప్పటికీ కొత్తగానే వుంది దాని నడక...

నా కడుపులోది తీసి దాని కడుపులో వేశాను. నా నోట్లోది తీసి దానినోట్లో వేశాను. తిన్నా తినకపోయినా

పిల్లలనుకున్నాను.

తిండి దగ్గరొచ్చిందా గొడవ?

తిండి దగ్గరకూడా వచ్చింది గొడవ. ఆ రోజు నాకింకా గుర్తుంది. ఎప్పటికీ గుర్తుండిపోతుంది కూడా.

''అనితా... ఈ అన్నమూ నువ్వు తినవే..'' నవతకు వడ్డించిన కంచాన్ని అనిత ముందుకు తోసింది. తనకు పెట్టిన అన్నం తిని కంచం ఖాళీ చేసిందాకా ఒప్పింది కాదు. అప్పుడు అడిగింది. 'ఇంత ఆకలీ... ఇవాళ ఒక్కరోజు కాదు, ఎన్ని రోజుల నుంచి ఎంతని దాచుకొస్తున్నావే..' అని దాని చెల్లిని పట్టుకు ఏడ్చింది. నన్నూ ఏడిపించింది.

నేనెప్పుడు అన్నం కంచం ముందు కూర్చున్నా అన్నం పురుగుల్లా కదుల్తున్నట్టు తోస్తుంది. అవాల్టి నుండి బలవంతంగా కళ్ళు మూసుకు అన్నం ముద్దని మింగినా... నవత చేసిన పనిని దిగమింగుకోలేక పోతున్నాను. అయినా నేనేం తప్పు చేశానని నన్ను అవమాన పరిచింది? తనలా బక్కగా ఉండిపోవద్దని ఆకలి తీరినంత... ఉన్నంతలోనే తినమని చెల్లికి హితబోధ చేస్తుందా? నేను తల్లిని కానా? నాకు దాని ఆకలి తెలుసు. కాని... కాని... ఆడపిల్ల ... ఆడపిల్లని ఒక ముద్ద తగ్గించాను, ఒళ్ళొచ్చేస్తే వయసు మీద పడిపోతుందని హద్దు పెట్టుకున్నాను. ఆడపిల్లలు ఎప్పటికీ ఎదగని లేత మొక్కల్లా వుండాలి. మగాళ్ళు మర్రిచెట్టుల్లా వున్నా గడిచిపోతుంది. గుండె పెరక్కూడదు, అలా అని తగ్గకూడదు. ఫలానా సావిత్రమ్మ కూతుళ్ళిద్దరూ మంచి 'పొజిషన్'లో వుంటారు అంటూ పెళ్ళి సంబంధాలు వెతుక్కుంటూ రావాలి.

అందుకనే మగపిల్లల్తో సమానంగా చెయ్యకూడనివి కొన్నుంటాయి. చదువయినా అంతే, ఆడపిల్లలు అంతరిక్ష పరిశోధనలు చేసొచ్చినా రాకపోయినా వంటగది వదిలి రాలేరు. ఉద్యోగం చేసినా ఊళ్ళేలినా వంటా చూసుకోవాలి... మా నాయినమ్మా, అమ్మమ్మా, నేనూ అంతే. 'నా కూతురా నువ్వూ అంతేనే' అంటే వినదే?! పిల్లల్నీ కాచుకోవాలి.

ఇవన్నీ మా నవతకు అర్థంకావు, అన్నయ్యలకు ట్యూషన్లు పెట్టించావు, మాకు లేదని గొడవ పెడుతుంది. అన్నిటికీ తూనిక పడుతుంది. అక్కడితో ఆగుతుందా? లేదు.. పౌరుషం ఎక్కువ. చెల్లిని తీసుకు వెళ్ళి కొవ్వొత్తుల కంపెనీలో జాయినైంది. మంచిదే... మనలాంటి లేనికాని బతుక్కి అందరం కష్టపడాలి. పైసా పైసా కూడగట్టి పదిని పాతికచేస్తే రేపు వాళ్ళ పెళ్ళిళ్ళకి.. వాటి ఖర్చులకి పనికొస్తాయి...

మా నవత నడకే వేరని చెప్పాను కదా, తను సంపాదించిందంతా చదువుకీ, వాటికీ ఖర్చు చేసింది. అక్కని చూసి దాని చెల్లి అనితా అలాగే తయారైంది. కన్నామే గాని వాళ్ళ బాగోగులు పట్టించుకోనట్టు ఇద్దరూ ప్రవర్తిస్తున్నారు. వాళ్ళ చదువులు ఆపు చేయించింది ఎందుకు? వీళ్ళు ఆడపిల్లలు పెద్ద చదువులు చదివితే అంతకన్నా పెద్ద చదువులు చదివిన వాళ్ళని తెచ్చి పెళ్ళి చెయ్యాలి.. తలకి తగిన తలపాగా చుట్టవే అమ్మా అంటే దానిక్కోపం...

## దటీజ్ విజయశాంతి

**లేడీ** ఓరియెంటెడ్ సినిమాల్లో నటిస్తూ లేడీ 'హీరో'గా ఓ వెలుగు వెలుగుతున్న విజయశాంతి రాజకీయాల్లోకి ప్రవేశించింది. 'రాజ్యసభకే వెళ్తావట గదా' అని ఎవరో అడిగారుట. 'నేను ఎప్పటికైనా పోటీ చేసి గెలిచే పార్లమెంట్‌కి వెళ్తా' అన్నదిట. దటీజ్ విజయశాంతి.



''మేమేం అశ్రద్ధ చేయలేదే..?!' ఇంటర్‌లోనే పెళ్ళి సంబంధం తెస్తే - తోటి ఆడపిల్లలు 'అమ్మమ్మా' అని పిలుస్తున్నారని, ఇప్పట్నుంచి పెళ్ళక్కర్లేదని - ఇంట్లో వాళ్ళతోనే కాదు... చేసుకోవడానికి వచ్చిన వాడికి చెప్పావు. 'నువ్వు తాతయ్యవే... కాని నేనింకా మనవరాల్ని... అని నోటికొచ్చినట్టు పేలావ్... వచ్చిన వాడు పిల్ల రాక్షసి' అనుకొని పారిపోయాడు.

ఇదిగో ఈ మహానగరానికి వచ్చాక... పడీలేచి - ఆగీ సాగిన నీ చదువు ఇంతటితో ఆగిపోతుందనుకుంటే - చెప్పా చెయ్యక డిగ్రీలో జాయినయ్యావు. మీ పిన్ని ఆసరా చూసుకొని ఆగేవుకాదు. అడిగితే పగలు ఏదో ఎక్కడో పనిచేసి ఈవినింగ్ కాలేజీ జాయినయ్యానన్నావు.. నీ చెల్లిదీ నీ దారే...

అదిగో అక్కడ్నుంచి నీ కథ మారిపోయింది. మా కథ మారిపోయింది. లోకానిదొక కథయితే, నీదొక కథ... కొత్త కథ... ఈడొచ్చిన ఆడపిల్లల కథ మాత్రం కాదు. ఇదీ మహిళల మార్గమంటూ కథలు తెచ్చి 'అమ్మా వినమ్మా' అంటూ వినిపించే దానివి. ఆ కథలు పేదరాశి పెద్దమ్మ కథలు కావు. పేదరాశి పెద్దమ్మ పెనిమిటి కథలు. వచ్చి నోళ్ళందరికీ వండి వార్చి - పొయ్యో కాలేను, పొయ్యిలోని బూడిదా కాలేనని, పూటకూళ్ళ ఇల్లొదిలి పారిపోయిన పెద్దమ్మ కథలు.. ప్రపంచ ప్రజలందరికీ తిండి తిప్పలూ కావాలని... బతికి చెడిన కథలు..


ఆ కథలన్నీ కొంతలో కొంత బాగుండేవి... నేనూ ఆడదాన్నే గదా... ఎక్కడో నా బతుకు తారసపడి ఆగిపోయేదాన్ని... అదే నవతకి అదునయ్యింది. పదునయ్యింది. ఎంచేతో నా కూతుళ్ళ మీద నాకు నమ్మకమూ పెరిగింది. పొద్దుగూకిన ఎంతో వేళకు గాని రాని కూతుళ్ళ మీద భయమూ కలిగింది. ఒక్కో రోజు ఇంటికి రాకపోతే ఎంతో బెదిరిపోయేదాన్ని. వాళ్ళ నాన్న కోపిష్టి అన్చెప్పి కప్పిపుచ్చేదాన్ని. స్నేహితులూ, ఫంక్షన్లూ అన్చెప్పి నేను కథలు చెప్పేదాన్ని. కథెక్కడ కాలు జారినా కాలో చెయ్యో తీసేయడం ఖాయమనిపించేది.

ఒక రోజు చూద్దువున్చెప్పి నేను పిల్లల వెంట వెళ్ళాను. నవత కూడా రమ్మంది. రకరకాల వయసు వాళ్ళు. అందరూ ఒకే చోటచేరి చదువులు.. స్టడీ సర్కిల్ ఆట... ఆటలు.. అంతకన్నా నాటకాలు.. రిహార్సలు.. అంతవరకూ ఆడవాళ్ళు లేని నాటికలూ, నాటకాలు ఎన్నో చూశాను కాని మగవాళ్ళు లేని అన్ని పాత్రలూ తామే అయిన ఆడపిల్లల నాటకాలు, వేషాలు.. ఎన్నో దురాచారాల మీద... ముఖ్యంగా వరకట్నం మీద...

కట్నం ఇవ్వడం నేరం... పుచ్చుకోవడం నేరం. ఆడపిల్లల అమ్మకాలు... డబ్బిచ్చి మరీ అమ్మకాలు.. కొనుగోలు.. బేరసారాలు... వ్యాపారం... వివాహం.. కట్నం చాల్లేదు... కిరోసిన్తోనో, గ్యాస్టవ్వు సిలిండర్ పేలిపోయో... మెడకు తాడు బిగించో... హత్యలు..

చెప్పకేం?... ఆ రాత్రి కట్నం చాలక బతుకు చాలించిన సగం కాలిన శవాన్ని ముట్టుకున్నట్టనిపించింది. మూగగానే నేను వుండిపోయాను. నవత చెపుతూనే వుంది. అనిత అందిస్తూనే వుంది.

''సంతలో పశువుని చూడ్డమంటే దాని పాలపాదుగుని చూడ్డం... ఖరీదు లెక్కగట్టడం... అది పశువు కాబట్టి మనిషి చేసింది తెలీక ఏ గుమ్మానికి నడవమంటే ఆ గుమ్మానికి నడిచిపోతుంది... ఆఖరికి కబేళాకి కూడా... అమ్మా... మరి మమ్మల్ని చూడ్డం అంటే ఏమిటి? పెళ్ళి చూపులంటే ఏమిటి? పాలపాదుగా?.. అదొచ్చా ఇదొచ్చా? మంచి దాసీదాన్ని కోరుకోవడమే




గదా, మగాడు ఆడదాన్లో ఏం చూస్తాడు? చూశాడు సరే... నచ్చి నిలబడతాడా? కట్నం తేలితేనే కదా నచ్చిందీ నచ్చందీ తేలేది? డబ్బూ ధనం నచ్చాకే కదా పిల్ల నచ్చడం... వద్దమ్మా మమ్మల్ని పశువుల్ని చేసి పది మంది ముందుకీ తొయ్యొద్దు...''

నేనింకేమీ మాట్లాడలేకపోయాను.

''వచ్చిన వాడి చూపులు కట్టుకున్న చీరని దొలిచేస్తున్నాయి. చెద పురుగులు నిల్చున్న పాటునే మీదపడి చీర వొల్చుకు తిన్నట్టు నేను నగ్నంగా నిలబడిపోయినట్టుగా వుంటుందమ్మా...' గొంతు వణికింది, చీకట్లో కనపడలేదు గాని నా కూతుళ్ళ కళ్ళు తడిచినట్టే తోచింది.

మరో రాత్రి-

కళ్ళ మీద మూతలు పడుతున్న సమయం...

'అమ్మా... మీరెందరు అక్కచెల్లెళ్ళే?!' తెలిసి అడిగింది నవత. 'నలుగురు' అని నేను కాదు, అనిత చెప్పింది. గుర్తు తెచ్చుకోమంది. నలుగురికీ పెళ్ళి చేసేశామని సంబరపడ్డ నా తల్లిదండ్రులు ఆ సమయాన గుర్తుకొచ్చారు.

''నా కొడుకు పక్కకేనా!, నా పక్క మీదెక్కవా?' అంటూ వేధించే మావయ్యతో పెదవి విప్పకుండా గుట్టుగా సంసారాన్ని లాకొచ్చే పెద్ద పిన్నీ... బియ్యం కడిగినప్పుడో, ఎసర్లో పోసినప్పుడో గింజనేల పడితే గిజగిజలాడి - మొట్టులు పెట్టి - సంపాదిస్తే తెలుస్తుందనే అత్తగారిని గౌరవంగా చూసుకొనే నడిపి పిన్ని...; అనుమానాల ఆభరణాలతో ఒళ్ళంతా బంకమన్నుని చేసిన భర్త గారిని వదలని చిన్న పిన్ని...''

''మరి ముగ్గురు పిన్నిలకే అక్క... మన అమ్మో?' అనిత అడిగింది.

''అన్నిటికీ తలూపే అమ్మ.. రాష్ట్రపతి! ఆమోద ముద్రకే తప్ప, అదెందుకు అని ప్రశ్నించలేని చాత కాని ఇల్లాలు... సాధారణ గృహిణి...''

ఏదో ప్రమాదం పొంచి వున్నదని ముందే పసిగట్టాన్నేను. అదే విషయం వాళ్ళ నాన్నా అన్నారు. వాళ్ళ అన్నలిద్దరూ కాక, వాళ్ళ చిన్న మావయ్యా అన్నాడు. నిజమే, ఆడ పిల్లలకుండే ఆలోచనల్లేవు... పిల్లలు చెయ్యిజారి పోతున్నారు.

కట్టడి చెయ్యాలి... కళ్ళెం వెయ్యాలి...

బస్సు పాసు, పుస్తకాలకీ ఇంక వేటికీ డబ్బులు ఇవ్వకపోయినా ప్రశ్నించరే... పార్ట్‌టైమ్ ఉద్యోగాలు... కట్నంకోసం కూడిక చెయ్యరే...

ఇప్పుడు చిన్నదీ ఏదో అయిదేళ్ళ కోర్సు.. డిగ్రీలో చేరిందే..

పెద్దది నవత కుట్లూ, అల్లికలు నేర్చుకోవడం మానేసి, కరాటే నేర్చుకుంది. ఎర్రరిబ్బనూ బ్లాకు బెల్టూ కట్టుకుంది.. అవే పిల్లలకీ ప్రవేట్లు చెపుతోంది. ఆడపిల్లలకి ఆత్మరక్షణ అంటుంది అనిత.

అన్నీ బాగున్నాయి... కాని... కాని...

చెప్పకుండా పెళ్ళి చూపులు పెట్టమన్నెప్పి, ఇంటికి ఆలస్యంగా వచ్చింది కాక ఆ పెళ్ళి కొడుకుని తిడుతుందా? చెయ్యి చేసుకోబోయిన మావయ్య మీద చెయ్యి చేసుకొని చెయ్యి విరిచేస్తుందా?

ఇల్లొదిలి పోతుందా?

ఆ మహిళా సంఘాలు మండిపోను... బుద్ధి చెప్పక, బుగ్గెత్తి పోస్తాయా?

పోలీసు స్టేషన్లూ... కోర్టులూ... తిరిగి తిరిగి... ఒట్టి చేతుల్తోటి వచ్చామా?

ఆ అనితా చిన్నదని... చూసి చూడకుండా పోతే అదీ అలానే చేసింది.

పరువు తక్కువ పని. జాతి తక్కువ పని. ఇంటా వంటా లేని పని. అసలు లోకంలో ఎక్కడా ఎప్పుడూ జరగని జరగబోని పని చేస్తారు. తలెత్తకుండా చేశారు.

పద్దెనిమిదేళ్ళు దాటితే కన్నోళ్ళకి హక్కు లేదట. పెంచి పెద్ద చేస్తే.. మాత్రం?... సంతానాన్ని తినేసే జంతువుల్లో కలిసిపోయామట. మిగతా జంతువుకీ మనిషికీ తేడా 'ఆడవాళ్ళని ఎంచుకు తినడమే'నట. నా నరాలు చిట్లిపోతున్నాయి... చెప్పలేను... మరి చెప్పుకోలేను...

❀❀❀

''ఇలాగని తెలిస్తే... పురిట్లో నూనెలో ముఖం చూడకుండా - ముందు సావిత్రి ముఖమూ చూడకుండా - ఆ వెనక పిల్లల ముఖమూ చూడకుండా గొంతు పిసికి చంపేద్దును...'' అవకాశాన్ని జారవిడచుకున్నందుకు నిజంగా నేను బాధపడుతున్నాను.

ఇప్పుడు నా కూతుళ్ళిద్దరూ నా పీక పిసికి చంపేశారు. నేను వాళ్ళిద్దర్నీ చంపితే, చంపగలిగితే అది నా ఆత్మరక్షణవుతుంది. ఆత్మరక్షణకు చేసిన దానికి ఆ భగవంతుడూ ఈ కోర్టులూ పోలీసులు కూడా తప్పు పట్టరు. నిజానికి వాళ్ళంతా (భగవంతుడి సంగతి కనపడడు గనుక తెలీదు) నా పక్షమే వున్నారు.

మీరే చెప్పండి? ... ఎవరయినా ఒళ్ళు కొవ్వెక్కి కలుస్తాం గాని... ఒళ్ళు కొవ్వెక్కి పిల్లల్ని కనం... అంచేత కన్నవాళ్ళకి కడుపున పుట్టిన వాళ్ళకి శత్రుత్వమా? ఇదేదో కారణం తెలియని శాపమే!...

'ఒరే ధర్మరాజా నువ్విప్పుడు ధర్మాలు చెప్తున్నావా?' అంటే చెప్పలేను గాని, అనుభవమ్మీద చెప్పే మాటొకటే. వయసులో వున్నప్పుడు కళ్ళు దిగాన వుండవు. నెత్తిమీద వుంటాయి. అంచేత భూమ్మీద ఏం జరుగుతోందో... ఎలా జరగాలో తెలియదు. ఇప్పుడు మా కూతుళ్ళు నవతకీ అనితకీ కళ్ళు కనబడ్డంలేదు.

మంచేదో చెడేదో మాకు తెలీదు? పనికిమాలిన చదువులు పాడు చేశాయి గాని చెప్పిన మాట వింటే ఎవడ్నో ఒకణ్ణి కట్టుకొని మనవడ్ని ఇచ్చెయ్యక పోదురా ఇద్దరూ?!.. అంతెందుకు వీళ్ళకంటే చిన్నది మా తమ్ముడు కూతురు వనజాక్షి పెళ్ళికి తలవంచి ఇద్దరు పిల్లలకి తల్లయిపోయింది.

ఆ మధ్య ఊరెళ్ళినప్పుడు నా తలతీసి మొలకి ముడిపెట్టినట్టయిపోయింది. నిజమే తమ్ముడి పిల్లలకీ, చెల్లెలి పిల్లలకీ అందరికీ పెళ్ళిళ్ళయిపోయాయి. మా ఆడపిల్లల ఈడువాళ్ళు... మన్నించండి మా పిల్లలు అని అనడానికే మనస్కరించడం లేదు. వీళ్ళ ఈడు వాళ్ళందరూ పెళ్ళిళ్ళయి బిడ్డా పాపలతో సుఖంగా వున్నారు...

అందరూ అడగడమే - మీ పిల్లల పెళ్ళెప్పుడు చేస్తావురా ధర్మరాజా?' అని - అది అడగడమా, కాదు ఎత్తిపొడుపు. 'కన్నావుగాని పెళ్ళి చెయ్యకుండా వదిలేశావ్... ఎవరితో లేచిపోతేనో?' అని అడగలేక

''రోజులు బాగాలేవు, కాలం మారిపోయింద''ని కని కట్టు కబుర్లు నేనెరగనా? మీరెరగరా?... అలా లేచిపోయినా బాగుణ్ను.. ప్చ్...

నిజమే, చేతకాని వాడినయ్యే ఊరొదిలి పట్నం వచ్చేశాను. అంతమాత్రం చేత పెళ్ళి చేసే తాహతు లేదనేనా? గంతకుతగ్గ బొంతని తెచ్చి కట్టబెడుదును. కాని నా పెళ్ళామొక చేతకాని లంజ. పిల్లలిద్దర్నీ వదిలేసింది. వాళ్ళు కొవ్వెక్కిపోయి... తిన్నది అరక్క... తమ బతుకేదో తాము చూసుకోక.. భూమ్మీద అన్యాయాలున్నాయట... అధర్మాలున్నాయట. అందునా ఆడవాళ్ళ బతుక్కి అవస్థలేనట... ఈ కళ్ళు పేలనిలం...లిద్దరూ భూమికి భుజం కాసేస్తారట... భుజం...

''ఏట్రో కూతుళ్ళిద్దర్నీ ఇంకా ఎమ్మేబియ్యేలు చదివిస్తానన్నావట. నిజమే, పెద్ద చదువులూ కాలేజీలయితే నీకు పెళ్ళి ఖర్చు తప్పిపోతుంది. ఆల్లే ఎవరి చెయ్యో పట్టుకెలిపోయి నిన్ను సేవ్ చేసి వాళ్ళూ సేవసిపోతారు, అంతేగదట్రా...' బామ్మర్ది ఎంకటిగాడి ఎకసక్కెం...

నిజమే, తట్టుకోలేకపోయాను, ఆ ఊపున ఊర్నుంచి వచ్చి - ఇంకా ఇంటికిరాని పిల్లలిద్దరికోసం చూసి- ఆలస్యంగా వచ్చారని తొక్కతీశాను. చిన్నప్పుడు పట్టిన కాకరాకు పసర కారిపోయింది దెబ్బకు..

కాకపోతే అష్టకష్టాలు పడి సంబంధం తెస్తే - పెళ్ళి చూపులొద్దంది సరే - పెళ్ళొద్దంది సరే - ఊరుకుందును. కాని ఆఖర్న ఆడదాన్నని మర్చిపోయి - వచ్చిన వాడు ఎంత రెండో పెళ్ళి వాడయితే మాత్రం - అతన్ని పట్టుకొని మీ ఆవిడ్ని ఎలాగ చంపేశావని అడుగుద్దా? ఇంట్లో సిలండర్ విప్పావా, కిరసనూనె పోస్నావా... అని అడుగుద్దా?' ఆడు బెదురుగొడ్డు. పారిపోయాడు. పోయినవాడు టముకేసుకు చెప్పడూ? మళ్ళీ ఎవరైనా మన గుమ్మం తొక్కుతారా? ముఖం చూస్తారా? పెళ్ళవుతుందా?

తాటతీయడానికి ఆడేటి మగేటి? చమ్డాలు వొలిచేశాను. బుద్ధొస్తుందనుకున్నాను. బుద్ధుంటే బువ్వ తింటావ్, లేకపోతే గడ్డి తింటావ్ అని చెప్పాను. ఊరంతా ఎప్పటికప్పుడు తెలిసిపోయి - పరామర్శలకొచ్చిన పది మందీ 'అమ్మల్లారా' అన్చెప్పి చెప్పారు. చెప్పాల్సింది చెప్పారు.

సరేకదా అని ఈ దఫా ఫస్ట్ హేండు కుర్రాణ్నే తెచ్చాను. చెపితే ఇల్లుపీకి పందిరేస్తుందని అలమ్మా నేనూ చెప్పకుండానే పెళ్ళి చూపులు ఏర్పాటు చేశాం. నా కొడుకులిద్దరూ సరస్వతీదేవి ఆల నుదిటన రాయకపోయినా - చెప్పిన పనులన్నీ చేసి ఇంటి పట్టునున్నారు. ఈ రాణులిద్దరూ సానుల్లాగ పొద్దుబోయి నెంత వేళకోగాని ఇంటికి రాలేదు. పోని లేటుగొచ్చిన పెద్దదాయి నోర్మూసుకోవద్దూ?... తిరిగి అగ్గిఫైరయిపోయింది. నాకు చెప్పకుండా పెళ్ళిచూపులా? విషం పెట్టినట్టు దిగమింగుకోలేకపోయింది.


సంతలో పశువులా అంది. ఏ పశువు కావాలని అడిగింది. అన్ని పశువులే. ఏ పశువులోనయినా చూసేదేముంటుంది అంది. పశువుల రంగూ రుచీ వాసన చూసేమంది. నీరేటెంత అంది. ఎంతకి తూగుతావ్ అడిగింది. ఒకర్ని డబ్బులిచ్చి పిల్లని(చ్చి) కొంటే మరో పిల్ల ఉచితమని చిన్నదాని చెయ్యి పట్టి ముందుకు తోసింది.

నేను అవాక్కయిపోయాను. పక్షవాతంపడ్డ వాళ్ళా అయిపోయాను. నా పెళ్ళాం సావిత్రి నోరెళ్ళబెట్టింది. నా కొడుకు లిద్దరూ కళ్ళెళ్ళబెట్టారు. మా ఆవిడ ఆఖరి తమ్ముడు మాత్రం మంచోడు.. ధైర్యవంతుడు.. కుటుంబం పరువు కాపాడగలిగిన వాడు... కాబట్టే నవత చెంప చెల్లుమనిపించాడు. జుట్టు పట్టి ఈడ్చాడు.. అదే ఆఖరు... జీవితంలో ఇంకెప్పుడూ చెయ్యి ఎత్తడు... ఎత్తలేడు... ప్చ్...

నవతకి కరాటే వచ్చును కదా మర్చిపోయాం. ఒక కాలు నేలమీద మరో కాలు నింగిమీద కాకపోయినా మామయ్య మెడ మీద వేసింది. నేనంతా మర్చిపోయి పౌరాణిక నాటకంలో సత్యభామని చూస్తున్నట్టు చూస్తూ వుండిపోయాను. దాని చెల్లి లేదూ అది 'గుడ్‌షాట్' అని చప్పట్లు చరిచినట్టే వుంది.

పెళ్ళి కొడుకు, అతని పరివారము పారిపోయారనడం సరికాదు, మాయమయి పోయారనడంమాత్రం సబబు.

నవత ఇంట్లోంచి ఎటో వెళ్ళిపోయింది. ఎవ్వరం ఆపలేకపోయాం. అనిత ఏమీ జరగనట్టే వుంది. సావిత్రమ్మ ఏదో సినిమా చూసినట్టు అనుకుంది. ఇది నిజమేనంటే నమ్మలేనట్టూ ఉండిపోయింది. నా పుత్రరత్నాలిద్దరూ వాళ్ళ మావయ్యని ఆసుపత్రికి తీసుకెళ్ళి సిమెంటు కట్టు వేయించి తెచ్చారు.




మరుసటి రోజు నవత ఎప్పట్లాగే ఇంటికొచ్చింది. ఏమీ జరగనట్టే వుంది. మావయ్య ఏదో అనబోతే 'నొప్పి తగ్గిందా?' పరామర్శిస్తూనే ''నన్ను తిడితే ఆ తిట్లన్నీ మా అమ్మకి అదే మీ అక్కకు తగులుతున్నాయి... ఆవిడకూ నీకూ ఒకే అమ్మ... ఎవరిపక్కా పడుకోబెట్టొద్దు...' కటువు మాటల్ని మృదువుగా చెప్పింది.

ఆరు మాసాలు గిర్రున తిరిగాయి.

ఈ దఫా మంచి సంబంధమే తీసుకొచ్చాను. కట్నం చాలదు.. కట్నం లేనిదే ఏ పుణ్య పురుషుడూ చేసుకోడు. నేను నిజానికి పెళ్ళిళ్ళు చెయ్యలేను. నా సీజనల్ వ్యాపారం దెబ్బతింది. రైతు బజార్లొచ్చాక కూరగాయల వ్యాపారమూ కుప్పకూలిపోయింది. ఇల్లు గడవడం కష్టంగా వుంది. ఆడపిల్లలిద్దరూ సంపాదనలో సగమే ఇస్తున్నారు, సరే ఆ విషయాలు అందాక దాటేస్తే, నా మీద ఒక మచ్చ వుంది, పడింది. ఆడపిల్లల పెళ్ళి చేయలేని అసమర్థుడినని అంతా జమకట్టేశారు.

ఆ మచ్చ చెరుపుకోవాలి, తుడుచుకోవాలి. ఆ పనీ నా కూతురే చేస్తుందని నాకు తెలుసు. అయినా తప్పదు గనుక 'ఒప్పుకో'మన్నాను. పెళ్ళి చేసుకోమన్నాను. పాతిక వేలు కట్నం చెప్పాను.

'కట్నం ఇచ్చి నేచస్తే చేసుకోను' మొదట్నుంచీ నిలబడ్డ మాట మీదే మళ్ళీ కూడా నవత నిలబడింది.

''నీకీ జన్మకి పెళ్ళికాదు'' సావిత్రమ్మ చెయ్యగలిగింది లేకపోయినా చేతులెత్తి దండం పెట్టింది. నవత ఏదో చెప్పబోయింది.

''నువ్వు ఉద్యోగానికెళ్ళొద్దు...''

''నువ్వు మహిళా సంఘానికెళ్ళొద్దు...''

''నువ్వు కరాటే క్లాసులు చెప్పొద్దు...''

''ఇంట్లోనే ఉండు...''

మనిషిదో ప్లే కార్డు. మనిషిదో స్లోగన్. అందరూ గన్స్ ఎక్కుపెట్టారు. అనిత ఆసక్తిగా చూస్తోంది.

కాల్చేసే ముందు చివరి కోరిక తీర్చేవారిలా ''నీ మనసులో ఎవరున్నారో చెప్పు... నీకు నచ్చినవాడ్ని చేసుకు (పో)...'' అడిగారు.

నవత అడ్డంగా తలూపింది.

''నువ్వెంత మగరాయుడివయినా మగాడివి కాదు, మగవాడయితే బ్రహ్మచారిగా వుండిపోతానంటే వదిలేద్దుం... ఆడదానివి... ఇదెక్కడి విడ్డూరమే... లోకానికి జడవే''సావిత్రమ్మ అరిచింది. మగాడు పెళ్ళి చేసుకోపోతే బ్రహ్మచారనో.. సన్యాసనో వది లేస్తారని, అదే ఆడది పెళ్ళి చేసుకోకపోతే... పెళ్ళి కాలేదని, అందుకు రంకు కూడా అంటగడతారని బోధపరిచింది.

(ఇంకావుంది)